ఎమ్మెల్యే ఆర్డర్..అనుమతులున్నా బుల్డోజర్

- విమర్శలకు తావిస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారుల తీరు
- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు.. పనుల అడ్డగింత
- అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో బిల్డర్ వేధింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో చెలరేగుతున్న ఓ అక్రమార్కుడితో చేయి కలిపి శేరిలింగంపల్లి జోన్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. కష్టార్జితంతో ఇల్లు కట్టుకునేందుకు అన్ని అనుమతులు పొందిన ఓ యజమానిని వివాదస్పద బిల్డర్ కోసం వేధించడం చర్చనీయాంశమవుతున్నది. గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబర్ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలాన్ని వీ దేవరాజ్, వీ కల్యాణి పేరుతో 2022 సంవత్సరంలో జీహెచ్ఎంసీకి నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. అంతా పరిశీలించాక టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఇటీవల దేవరాజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇదే కాలనీ హౌజింగ్ సొసైటీపై పెత్తనం చలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్‌రావు కన్ను ఈ స్థలంపై పడింది. అక్కడి నుంచి పనులను అడ్డుకోవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో దేవరాజ్ గత నెల 27న శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే(అధికారపార్టీ) అండతో శ్రీధర్‌రావు చెలరేగిపోయాడు. ఆయన ఆదేశాలతో అధికారులు దేవరాజ్ నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇందేంటని ప్రశ్నిస్తే తమకు ఫిర్యాదు అందిందని అనుమతినిచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు. ఈ క్రమంలో దేవరాజ్‌పై తరచూ వేధింపులు ఎక్కువయ్యాయి. అన్ని అనుమతులతో నిబంధనలకు అనుగుణంగా పనులు మొదలుపెడితే కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎఫ్‌సీఐ కాలనీలో నిర్మాణ పనులు అడ్డుకుని, ఫెన్సింగ్ తొలగిస్తున్న అధికారులు

చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు

ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర

- అద్దె బస్సులతో అధోగతి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే
- కార్మికులను అణచివేసే చర్యలు మానుకోవాలి
- 'చలో బస్‌భవన్'లో ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు అద్దె బస్సుల పేరుతో ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర చేస్తున్నదని ఆర్టీసీ జేఏసీ నేతలు విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని చెప్పి మరిచిపోయిందని తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ ట్యాక్సల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఆర్టీసీ డ్రైవర్ల సంఖ్యను పెంచితే తెలంగాణలో మాత్రం కుదిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం 44 చట్టాలను తీసేసి 4 కోడ్‌లుగా విభజించడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీలో 12 నుంచి 16 గంటలపాటు డ్యూటీ చేయిస్తూ యాజమాన్యం కార్మిక శ్రమశక్తిని దోచుకుంటున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి సరఫరా చేయాలని కన్వీనర్ మౌలానా పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానికల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కో-కన్వీనర్ కత్తుల యాదయ్య కోరారు. మహాలక్ష్మి పథకంలో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు స్మార్ట్ కార్డు ఇవ్వాలని సుద్దాల సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కమలాకర్‌రెడ్డి, బీ యాదగిరి, వివిధ జిల్లాల ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

తాగినడిపితే లైసెన్స్ రద్దే..

- అతివేగంగా, అధిక లోడ్‌తో వెళ్తే లైసెన్స్ క్యాన్సిల్
- నిబంధనలు మరింత కట్టుదిట్టం
- డేటాబేస్ ఆధునీకరణకు రవాణా, పోలీస్ శాఖల చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మద్యం తాగి వాహనం నడిపితే వాహనదారుడిపై కేసు నమోదుతో పాటు లైసెన్స్ రద్దు కానున్నది. అధిక వేగం, బరువుతో గూడ్స్ వెహికల్స్ నడిపినా లైసెన్స్ రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నారు. ఏడాదిలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణాశాఖ సస్పెండ్ చేసింది. ఇందులో ఎక్కువగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులే ఉన్నట్టు తెలిపారు. ఒకే వ్యక్తి మూడు సార్లు మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసులు రవాణాశాఖకు సిఫార్సు చేయనున్నారు. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు రవాణా, పోలీస్ శాఖలు డేటాబేస్‌ను ఆధునికరించాలని యోచిస్తున్నాయి. పట్టుబడిన వ్యక్తి ఫోటో లేదా ఆధార్ నంబర్ డేటాబేస్‌తో కనెక్ట్ చేయడంతో లైసెన్సు నంబర్, ఎక్కడ తీసుకున్నది క్షణాల్లో అధికారులకు తెలిసిపోనున్నది. దీంతో రవాణాశాఖ సులభంగా లైసెన్స్ సస్పెన్షన్ చేపట్టనున్నారు.

'మెగాఫుడ్ పార్క్' సభ వెలవెల

- పొగడ్తలకే పరిమితమైన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల ప్రసంగం
- విసుగెత్తిన ప్రజలు.. సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన వైనం

పెనుబల్లి (సత్తుపల్లి), డిసెంబర్ 5 : ఖమ్మం జిల్లా బుగ్గపాడులో గురువారం జరిగిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒకరినొకరు పొగుడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు సభ నుం లేచిపోవడంతో ఖాళీ కుర్చీలే మంత్రుల ప్రసంగాన్ని వినాల్సి వచ్చింది. ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకాగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. మంత్రులు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడంతో ప్రజలు వెళ్లిపోయారు.

సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మధ్యలోనే వెళ్లిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

హోంగార్డులకు నో 'రైజింగ్'

- ఏటా జరిగే కార్యక్రమాలకు సైతం మంగళం
- అడ్రస్‌లేని కవాతు, స్పోర్ట్స్‌మీట్, ప్రశంసాపత్రాలు
- అమరజవాన్ల త్యాగాలను అవమానించినట్టే
- నేడు హోంగార్డుల 75వ రైజింగ్‌డే

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఓ వైపు రాష్ట్రంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ 75వ రైజింగ్‌డేను గాలికి వదిలేసిందని హోంగార్డులు వాపోతున్నారు. దేశంలో హోంగార్డుల వ్యవస్థ ప్రారంభమై 75 ఏండ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా.. డిసెంబర్ 6న ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన స్వర్ణోత్సవాలను ప్రభుత్వం, పోలీసుశాఖ గాలికి వదిలేసినట్టు తెలుస్తున్నది. ఒక్క రక్తదానం మినహా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర హోంశాఖ సిద్ధంగా లేదని రాష్ట్రంలో హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డుల రైజింగ్‌డే రోజున ప్రతియేటా కవాతు, స్పోర్ట్స్‌మీట్స్ నిర్వహించి తమను ప్రోత్సహించేవారని, ఆయా విభాగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి రివార్డులు, ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు ఇచ్చేవారని, ఆరోజు తమకు భోజన ఏర్పాట్లు కూడా చేసేవారని చెప్తున్నారు. తాము ఎంతగానో నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఇలా గాలికి వదిలేయడం ఆవేదనకు గురిచేస్తున్నదని అంటున్నారు. ఇది విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు చేసిన వారిని అవమానించడమేనని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసి, అన్ని జిల్లాల్లో ఘనంగా హోంగార్డుల రైజింగ్‌డేను నిర్వహించాలని వారు కోరుతున్నారు.

హోంగార్డుల సమస్యలపై పట్టింపేది?

'అటెండర్‌కు ఎక్కువగా.. పోలీసుకు తక్కువగా' డ్యూటీలు చేస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఆర్డర్లీ వ్యవస్థను తొలగించాలని, 600కు పైగా ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. అలాగే హోంగార్డుల సాధారణ మరణానికి రూ.5 లక్షల నగదు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్టు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక భరోసా కల్పించాలని, ఆరోగ్య భద్రత తమకు కూడా వర్తింపచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

ద్రోహి సమాచారంతోనే ఎన్‌కౌంటర్

- విషమిచ్చి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు
- కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు బాధ్యత వహించాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- 9న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

ములుగు, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఈ నెల 1న ములుగు జిల్లా చెల్పాక వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు మావోయిస్టులకు విషమిచ్చి చంపారని భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 30న ఏడుగురితో ఉన్న దళం చెల్పాక పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామంలో నమ్మిన వ్యక్తికి భోజనాలు ఏర్పాటు చేయమని కోరారని తెలిపారు. అప్రూవర్‌గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం కలిపి స్పృహ కోల్పోయేలా చేశారని చెప్పారు. చిత్రహింసలు పెట్టి తెల్లవారుజామున 4 గంటలకు కాల్చి చంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హత్యాకాండను నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్టు వెల్లడించారు. ప్రజాస్వామికవాదులు, విద్యాలయాలు, వ్యాపారసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, బాధ్యత వహించి, న్యాయ విచారణ జరిపి పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మాజీ సర్పంచ్‌ల హత్య

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 5 : మవోయిస్టులు ఇద్దరు మాజీ సర్పంచ్‌లను దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం వెలుగుచూసింది. బీజాపూర్ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు సుఖ్‌రామ్ అవ్‌లం, సుక్లు ఫర్సాను మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి అపహరించుకెళ్లారు. పార్టీకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో వారిని హత్య చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటన బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

అల్పాహారంలో నాణ్యతా లోపం..

కార్మికుల ఆగ్రహం

మందమర్రి, డిసెంబర్ 5: మందమర్రి ఏరియాలోని కేకే-5 గని క్యాంటీన్‌లో నాణ్యత లోపించిన అల్పాహారాన్ని అందించడంపై గని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం కార్మికులకు పూరీలను అల్పాహారంగా అందించారు. పూరీ బరువు 16 గ్రాములు ఉండాల్సి ఉండగా కేవలం 8 నుంచి 10 గ్రాములు మాత్రమే ఉందని, నాణ్యత పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ క్యాంటీన్‌కు వెళ్లి పూరీలను పరిశీలించారు. నిర్వాహకులను మందలించి మరో సారి ఇలా జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు.

కార్మికుల సమక్షంలో పూరీలను తూకం వేస్తున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ

పింఛన్లపై ఇంటర్నల్ ఆడిట్

హాజీపూర్, డిసెంబర్ 5 : మండలంలోని ముల్కల్ల, రాపల్లి, హాజీపూర్ గ్రామాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మండల అభివృద్ధి అధికారులు శ్రీనివాస్ రావ్, శ్రీనాథ్ దొనబండ, కర్నమామిడి, బుద్ధిపల్లి గ్రామాల్లో, బాలరాజ్, సురేందర్ బుధవారం ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు అందుతున్న పింఛన్ల వివరాలపై అడిట్ చేశారు. గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వం నుంచి వస్తున్న పెన్షన్లు సక్రమంగా అందుతున్నాయా, పోస్ట్ ఆఫీస్ వారు ఎమైనా అక్రమాలకు పాల్పడుతున్నారా అనే వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల పేర్ల నమోదు, రికార్డులను పరిశీలించారు. వీరి వెంట హాజీపూర్ మండల అభివృద్ధి అధికారి జేఆర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పోస్ట్ మాస్టర్ విశ్వనాథం తదితరులు ఉన్నారు.

మందమర్రిలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జీఎం దేవేందర్

గోలేటిలో మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

సింగరేణి ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

మందమర్రి ఏరియా జీఎం దేవేందర్

మందమర్రి, డిసెంబర్ 5: ఈ నెల 23న మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించనున్న సింగరేణి ఆవిర్భావ వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఏరియా జీఎం జీ.దేవేందర్ సూచించారు. జీఎం కార్యాలయ ఆవరణలో కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఏరియాలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం దేవేందర్ మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా ఆహార స్టాళ్లు, కంపెనీకి సంబంధించిన స్టాళ్ల ఏర్పాటు చేయడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వేడుకలకు సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబాల ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏరియా ఎస్వోటూ జీఎం విజయ్ ప్రసాద్, ఏఎస్వో రవీందర్, ఏరియా ఇంజినీర్ వెంకటరమణ, డీజీఎం(ఎఫ్ అండ్ ఏ) ఆర్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, డీజీఎం(కేకే5) ప్రవీణ్ ఫటిక్, ఏరియా సర్వే అధికారి ఉజ్వల్ బంధోపాధ్యాయ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి, ఐటీ డిప్యూటీ మేనేజర్ రవి, సివిల్ ఎస్ఈ జయప్రకాశ్, వర్క్‌షాప్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ రవి, గని మేనేజర్లు, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో ఏర్పాట్లపై సమీక్ష

రెబ్బెన, డిసెంబర్ 5: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో ఈ నెల 23న నిర్వహించే సింగరేణి దినోత్సవ ఏర్పాట్లపై గురువారం సాయంత్రం గోలేటి జీఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్‌హాల్‌లో బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏరియాలోని ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో లైటింగ్, బ్యాండ్, సౌండ్ సిస్టం, కళా బృందాలు, స్టాళ్ల ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాల కోసం ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీంరావుజాడే, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, తదితరులున్నారు.

భీమన్న క్రీడామైదానంలో సూచనలు చేస్తున్న ఏరియా జీఎం శ్రీనివాస్

క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయాలి

బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన, డిసెంబర్ 5: బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో క్రీడాకారుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ఏరియాలోని గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో జరుగుతున్న పనులను గురువారం సాయంత్రం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 91వ వార్షిక క్రీడల్లో భాగంగా కంపెనీ స్థాయి క్రికెట్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఎస్వోటూజీఎం రాజమల్లు, సివిల్(ఎస్ఈ) మదీనా బాషా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్‌తో పాటు పలువురు ఉన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

-ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, డిసెంబర్ 5 : కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు కార్మిక సంఘంగా కృషి చేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఆర్కే 7గనిపై ఏర్పాటు సమావేశంలో మాట్లాడారు. మైనింగ్ స్టాఫ్ సూపర్‌వైజర్లు, ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్లు అండర్ గ్రౌండ్ మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి ఉపరితలంలో సుటేబుల్ జాబ్ ఇవ్వడానికి, మైనింగ్ టెక్నికల్ సూపర్‌వైజర్లకు కూడా సుటేబుల్ జాబ్ ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఈపీ ఆపరేటర్ల సమస్యలపై చైర్మన్‌తో జరిగే చర్చల్లో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డిస్మిస్ అయిన జేఎంఈటీలను తిరిగి తీసుకోవడానికి అంగీకరించారన్నారు. మిగతా డిస్మిస్ వారిని కమిటీ వేసి నిర్ణయం తీసుకోవడానికి హామీ ఇచ్చారన్నారు. ప్రైవేట్ వారితో నడిపిస్తున్న క్యాంటీన్లను కంపెనీ నడపడానికి, క్వాలిటీ, క్వాంటిటీ పెంచడానికి హామీ ఇచ్చారని చెప్పారు. ఇన్సెంటివ్‌లు, అలవెన్స్‌ల పెంపు, మారు పేర్లు, విజిలెన్స్ కేసులు, పెండింగ్ డిపెండెంట్ కేసులు, వివిధ కేటగిరిల కార్మికుల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి, డిసెంబర్ 5 : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. గురువారం పట్టణ సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 28న డైరెక్టర్ పా ఆధ్వర్యంలో జరిగిన స్ట్రక్చరల్ సమావేశంలో కార్మికులకు సంబంధించిన 13 సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెలలో సీఅండ్ఎండీ ఆధ్వర్యంలో జరిగే స్ట్రక్చర్ సమావేశంలో కార్మికుల సమస్యలను లేవనెత్తనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, అసిస్టెంట్ కార్యదర్శి, శాంతిఖని గని పిట్ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్, నాయకులు చిప్పనర్సయ్య, బొంతల లక్ష్మినారాయణ, గుండా చంద్రమాణిక్యం, రత్నం ఐలయ్య, డీ.ఆర్.శ్రీధర్ పాల్గొన్నారు.

ఐఆర్‌పీఎం జీఎం పర్సనల్ పర్యటన

శ్రీరాంపూర్, డిసెంబర్ 5 : శ్రీరాంపూర్ ఏరియా ఓసీపీ క్యాంటిన్‌ను గురువారం జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) కవితానాయుడు సందర్శించారు. జీఎం ఎల్‌వీ సూర్యనారాయణతో కలిసి సందర్శించారు. క్యాంటీన్‌లోని తినుబండారాల నాణ్యతపై కార్మికులను అడిగి తెలుసుకున్నారు. శ్రీరాంపూర్ సింగరేణి సూపర్‌బజార్‌ను సందర్శించారు. అనంతరం క్యాంటీన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జీఎం ఆఫీస్‌లో ఉద్యోగులను కలిశారు. ఈ సందర్భంగా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, ఎస్వోటూ జీఎం సత్యనారాయణ, పీవో శ్రీనివాస్, డీవైజీఎం అరవిందరావు కవితా నాయుడును శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులకు సూపర్‌బజార్ సేవలు అందించాలని, గృహ సరుకులను నాణ్యమైనవి అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌బజార్ డివిజన్ మేనేజర్ రాజు, సీనియర్ పీవో కాంతారావు, శంకర్, అజయ్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.

నేడు గైర్హాజర్ ఉద్యోగులకు కౌన్సెలింగ్

మందమర్రి, డిసెంబర్ 5: ఈ నెల 6,7 తేదీల్లో సింగరేణి మందమర్రి ఏరియాలోని గనులు, విభాగాలకు చెందిన గైర్హాజర్ ఉద్యోగులకు స్థానిక సీఈఆర్ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గురువారం ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్ తెలిపారు. కౌన్సెలింగ్‌లో తరచుగా విధులకు గైర్హాజర్ అవుతున్న ఉద్యోగుల సమస్యలు, గైర్హాజర్ గల కారణాలను తెలుసుకుని వారికి తగు సూచనలు చేయనున్నట్లు తెలిపారు. గైర్హాజరు మూలంగా ఉద్యోగ భద్రతకు వాటిల్లే ముప్పుపై వారికి అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

రక్తదానం

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 5: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ లో గల మహేంద్ర ఫైనాన్స్ సంస్థకు చెందిన పలువురు యువకులు బుధవారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న తలసేమియా, సికిల్‌సెల్ రోగులకు అందిస్తామని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ తిరుపతి, సేల్స్ మేనేజర్లు వెంకటేశ్, వేణు, సిబ్బంది సందీప్, ఆంజనేయులు, సుమన్, అనిల్‌కుమార్, రాము, రాజనర్సు, సంజయ్, రక్తనిధి సిబ్బంది విజయ్‌కుమార్, వేణులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కెరమెరి, డిసెంబర్ 5: ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. గురువారం కెరమెరి మండలంలోని సుల్తాన్‌గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. నాణ్యమైన ఆహార పదార్థాలతో చేసిన భోజనాన్ని అందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర సర్వే డాటా ఎంట్రీ నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆడే ప్రకాశ్, ఎంపీడీవో మహ్మద్ అమ్జద్ పాషా, డిప్యూటీ తహసీల్దార్ గోడం సంతోష్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీలో జాప్యం వద్దు

జైనూర్, డిసెంబర్ 5: ఇటీవల నిర్వహించిన కులగణన సర్వే వివరాలను ఆన్‌లైన్ వేగవంతంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. శివ్‌నూర్, భుసిక్యాంపు గ్రామాల్లో నిర్మిస్తున్న పాఠశాలల భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆడ భీర్ష, ఎంపీడీవో సుధాకర్, సిబ్బంది ఇందల్, భీంరావు, మోహన్, శ్రీనివాస్, నగేశ్, గౌతం తదితరులున్నారు.

సుల్తాన్‌గూడ పాఠశాల హెచ్ఎంతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆర్టీసీ ప్రయాణికులకు సన్మానం

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 5: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపోలో ఏర్పాటు చేసిన ఉచిత బస్సు ప్రయాణం విజయోత్సవ కార్యక్రమానికి డిపో మేనేజర్ విశ్వనాథ్ తో కలిసి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే హాజరయ్యారు. అనంతరం ఉద్యోగ, వ్యాపార, పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లే మహిళా ప్రయాణికులను ప్రోత్సహిస్తూ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో..

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 5: మంచిర్యాల ఆర్టీసీ డిపోలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు మహిళా ఉద్యోగినులను ఎమ్మెల్యే కే ప్రేంసాగర్‌రావు సన్మానించారు. డిపో మేనేజర్ జనార్దన్, అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.